ప్రజాశక్తి
బుధవారం 29 మార్చి 2023
5
పార్వతీపురం మన్యం



31న జాబ్‌మేళా : కలెక్టర్

కలెక్టరేట్ : సాలూరులోని వైటిసిలో ఈనెల 31న జరగనున్న మెగా జాబ్‌మేళా పోస్టర్‌ను కలెక్టర్ నిశాంత్ కుమార్ మంగళవారం విడుదల చేశారు. ఈ మెగా జాబ్ మేళాకు 12 బహుజన కంపెనీ ప్రతినిధులు హాజరై అర్హత కగల అభ్యర్థులను వారి కంపెనీలో ఎంపిక చేసుకుంటాయన్నారు. ఎపి నైపుణ్యాభివృద్ధి సంస్థ వారి ఆధ్వర్యంలో ఉపాధికల్పనలో భాగంగా పదో తరగతి, యుజి. పిజి కోర్సుల్లో ఉత్తీర్ణత సాధించి 18 నుంచి 27 ఏళ్ల మధ్య గల నిరుద్యోగ యువతీ, యువకులు అర్హులన్నారు. కార్యక్రమంలో జిల్లా నైపుణ్యాభి వద్ధి అధికారి సాయికుమార్, ఫైనాన్షియల్ ఎగ్జిక్యూటివ్ కంచిబాబు, ప్లేస్మెంట్ ఎగ్జిక్యూటివ్ మనోజ్ కుమార్ పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

మన్యంలో 1.06కోట్ల పనిదినాలు

- కష్టానికి తగ్గట్టు పెరగని కూలి
- పోడు భూముల అభివృద్ధికి దోహపడుతున్న ఉపాధి హామీ చట్టం



పార్వతీపురం మన్యం జిల్లాలో ఉపాధిహామీ చట్టం లక్ష్యానికి మించి చేరువైంది. ఉపాధి హామీ పథకంతో గ్రామాల్లోని పేదలు, వ్యవసాయ కూలీలు, చిన్నసన్నకారు రైతులకు పనులు పుష్కలంగా లభిస్తున్నాయి. ముఖ్యంగా పోడు భూముల అభివృద్ధికి ఎంతో దోహదపడుతోంది. ఈ ఏడాది ఇప్పటి వరకు కోటీ 6లక్షల పనిదినాలను కల్పించినట్టు అధికారులు చెబుతున్నారు. మార్చి నెలాఖరు నాటికి ఈ సంఖ్య 1.10కోట్లకు పెరిగేందుకు అవకాశాలున్నాయని కూడా అధికారులు లెక్కకడుతున్నారు. మరోవైపు కేంద్ర ప్రభుత్వం విధించిన నిబంధనల వల్ల కూలీల శ్రమకు తగ్గ వేతనం లభించడం లేదు.

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

వామపక్షాల మద్దతుతో అధికారంలోకి యుపిఎ -1 కనీస ఉమ్మడి కార్యక్రమంలో భాగంగా మహాత్మ గాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టం ప్రవేశపెట్టిన విషయం విధితమే. ఈ చట్టం నిబంధనల ప్రకారం పని కోరిన వెంటనే గ్రామసభ నిర్వహించి పని కల్పించాలి. లేదంటే జాప్యం జరిగిన కాలానికి నష్టపరిహారం కూడా చెల్లించాల్సి ఉంటుంది. ఇటువంటి బృహత్తర పథకాన్ని ఉపయోగించుకోవడంలో విజయనగరం ఉమ్మడి జిల్లా ఎంతో ఆదర్శంగా నిలిచింది. జిల్లాలో పేదలు, వ్యవసాయ కార్మికులు, సన్న చిన్నకారు రైతులు ఉండడమే ఇందుకు కారణం. జిల్లా పునర్విభజతో పార్వతీపురం మన్యం జిల్లా ఆవిర్భవించిన విషయం విధితమే. ఈ జిల్లాలో పరిధిలో 1.68లక్షల మందికి ఉపాధి కార్డులు ఉన్నాయి. వీరంతా గత ఏడాది కోటి 3లక్షల పనిదినాలు ఉపయోగించుకున్నారు. ఈ ఏడాది ఇప్పటి వరకు కోటీ 6లక్షల పనిదినాలు కల్పించారు. ఈ ఏడాది తొలుత 86లక్షల పనిదినాలు కల్పించడం లక్ష్యంగా పెట్టుకున్నామని, అనంతరం లక్ష్యాన్ని కోటికి పెంచుకోగా ఇప్పటి వరకు లక్ష్యాన్ని దాటిన నేపథ్యంలో మిగిలిన నాలుగైదు రోజుల్లో మరో నాలుగు లక్షల పనిదినాలు కల్పిస్తామని చెబుతున్నారు. గత ఏడాదితో భేరీజు వేస్తే కూలీల కష్టానికి తగిన ఫలితం రావడం లేదు. గత ఏడాది ఒక్కపూటే పనిచేసేవారు. 2022-23 ఆర్థిక సంవత్సరం మొదలు నుంచి రెండు పూటలా తప్పనిసరిగా పనిచేయాలనే మెలిక పెట్టింది. కానీ, అందుకు తగ్గట్టు కూలి రావడం లేదు. గత ఏడాది ఒక్క పూట పనిచేస్తే రూ.167 నుంచి రూ.180 వరకు వచ్చేది. ఈ ఏడాది రెండు పూటలా పనిచేస్తున్నా సగటు దినసరి కూలి రూ.200లకు మించడం లేదు. దీనికితోడు వేసవి అలవెన్సులను కేంద్రం రద్దచేసింది. దీంతో పని ప్రదేశంలో నీరు, నీడ కల్పించడం కష్టతరంగా మారింది. పార, గుణపాం, తట్ట వంటివి పనిముట్లకు గతంలో కొంతమొత్తం చెల్లించేవారు. ఏడాదిగా దీన్ని కూడా ఇవ్వడం లేదు. ఇలా అనేక నిబంధనలు పెట్టడంతో కూలీల శ్రమకు తగ్గ ఫలితం రావడం లేదు. మరోవైపు జిల్లాలో అటవీ హక్కుల చట్టం ప్రకారం ప్రభుత్వం ఇచ్చిన భూముల అభివృద్ధికి ఉపాధి హామీ పథకం ఎంతో దోహదపడుతోంది. గిరిజనులు వారికి కేటయించిన భూములను చదును చేసుకోవడం, గట్లు ఎత్తుకోవడం, మొక్కలు నాటుకోవడం వంటి పనులు చేయడంలో జిల్లాలో ఉపాధి పనులు లక్ష్యానికి మించి సాగుతున్నాయి.

'ఉపాధి' పనులతో పోడు భూముల అభివృద్ధి



వాస్తవానికి జిల్లాలో గిరిజన, మైదాన ప్రాంతాలు వేర్వేరు స్వభావంతో ఉంటాయి. మైదాన ప్రాంతంలో వర్షాకాలంలోనూ, ఖరీఫ్ సీజన్‌లోనూ పనులు తక్కువగా జరుగుతాయి. కానీ, గిరిజన ప్రాంతంలో నిరంతరం ఉపాధి పనులు చేపడుతున్నాం. ఎందుకంటే మొట్ట ప్రాంతంలో వర్షం పెద్ద ఆటకం కాదు. పైగా తవ్వకానికి ఉపయోగకరంగా ఉంటుంది. అందువల్లే లక్ష్యాన్ని మించి పని చేయగలిగాం.

కె.రామచంద్రరావు, డ్వామా పీడీ,

మొబైల్ టవర్లు అందుబాటులోకి రావాలి

ఇప్పటికే అందుబాటులోకి వచ్చిన 4 టవర్లు
47 ప్రదేశాల్లో ఆర్‌ఒఎఫ్‌ఆర్ అనుమతులు

ప్రజాశక్తి - కలెక్టరేట్

మొబైల్ టవర్లు త్వరగా అందుబాటులోకి రావాలని కలెక్టర్ నిశాంత్ కుమార్ అన్నారు. మొబైల్ టవర్లు అందుబాటులోకి రావడం వల్ల గిరిజన ప్రాంతాల్లో విప్లవాత్మక మార్పులు వస్తాయని పేర్కొన్నారు. జిల్లా స్థాయి ఆర్‌ఒఎఫ్‌ఆర్ కమిటీ సమావేశం, మొబైల్ టవర్ల ప్రగతి సమీక్షా సమావేశం కలెక్టరేట్‌లో మంగళవారం జరిగింది. రిజర్వ్ అటవీ ప్రాంతంలో 47 ప్రదేశాల్లో మొబైల్ టవర్ల నిర్మాణానికి అనుమతి ఇస్తూ కమిటీ తీర్మానించింది. పేద గిరిజనుల సంక్షేమానికి, వెనుకబడిన, సుదూర ప్రాంతాల అభ్యున్నతికి సమాచార, సాంకేతిక మౌలిక సదుపాయాల వినియోగం, కమ్యూనికేషన్ ప్రాధాన్యతను దృష్టిలో పెట్టుకొని రెవెన్యూ, అటవీ, గిరిజన సంక్షేమ శాఖల అధికారులు, కమిటీ సభ్యుల అభిప్రాయాలు తీసుకుని టవర్ల నిర్మాణానికి తీర్మానాన్ని కమిటీ చేసింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కమ్యూనికేషన్ ప్రాధాన్యతను టెలికాం సంస్థలు గుర్తించి టవర్ల నిర్మాణం వేగవంతం చేయాలన్నారు. మార్చి, ఏప్రిల్ మాసాంతంలో కొన్ని, జూన్ రెండో వారానికి మిగిలినవి పూర్తి చేయాలని ఆయన స్పష్టం చేశారు. బిఎస్ఎన్ఎల్ పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. టెలికాం సెక్యూరిటీ డైరెక్టర్ ఇప్పటికే జిల్లాలో పర్యటించారని కలెక్టర్ చెప్పారు. గుమ్మలక్ష్మీపురం మండలంలో కొన్ని గ్రామాల్లో ఒక టెలికాం సంస్థకు చెందిన సేవలు మాత్రమే అందడం వల్ల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉంటుందని, ఎటువంటి ప్రాంతాల్లో ఇంటర్ సర్కిల్ రోమింగ్ (ఐ.సి.ఆర్) ఏర్పాటు చేసి నిర్వహించాలని ఆయన సూచించారు. ఏ నెట్ వర్క్ అయినా ప్రజలు ఉపయోగించుకునే పరిస్థితి ఉండాలన్నారు. సమస్యలు తక్షణమే పరిష్కరించేందుకు పార్వతీపురం ఐటిడిఎ పిఒను సంప్రదించాలని చెప్పారు. జియో ప్రతినిధి సత్య తమ పనులను వివరించారు. జియ్యమ్మ వలస మండలం గొర్లి, పాచిపెంట మండలం కుంతంబడేవలస, కురుపాం మండలం పెల్లివలస, రంగుపురం గ్రామాల వద్ద ఏర్పాటు చేసిన టవర్ల నుంచి ఇప్పటికే మొబైల్ సిగ్నల్స్ విడుదల చేశామన్నారు. 72 ప్రదేశాల్లో జియో సంస్థ టవర్లు నిర్మిస్తుందన్నారు. 48 ప్రదేశాల్లో పనులు ప్రగతిలో ఉన్నాయని వివరించారు. తమ సంస్థకు కేటాయించిన ప్రదేశాల్లో 21 రిజర్వ్ అటవీ ప్రాంతంలో ఉందని అన్నారు. మార్చి నాటికి లక్ష్యంగా నిర్ణయించిన నాలుగు టవర్లు అందుబాటులోకి వచ్చాయని, ఏప్రిల్‌లో 9, మే, జూన్‌లో 14 చొప్పున, జూలైలో 3టవర్లు అందుబాటులోకి తీసుకొస్తామని ఆయన వివరించారు. ఏయిర్ టెల్ ప్రతినిధి డేనియల్ మాట్లాడుతూ మార్చిలో ఆప్టికల్ కేబుల్ పనులు పూర్తి చేసి, ఏప్రిల్‌లో 16, మేలో 7టవర్లు అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఒ.ఆనంద్, ఐటిడిఎ పిఒ సి.విష్ణు చరణ్, డిఆర్‌ఒ జె.వెంకటరావు, సబ్ కలెక్టర్ నూరుల్ కమర్, ఆర్‌డిఒ కె.హేమలత, డిఎఫ్‌ఒ జిఎపి ప్రసూన, అటవీ, ఇపిడిసిఎల్, బిఎస్ఎన్ఎల్, జియో, ఎయిర్ టెల్ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.



కాలువ పనులను పరిశీలిస్తున్న జైకా బృందం సభ్యులు

డిసెంబర్ నాటికి ఆధునికీకరణ పనులు పూర్తి

ప్రజాశక్తి - పాచిపెంట

మండలంలోని పెదగెడ్డ ఆధునీకరణ పనులు డిసెంబర్ 31 లోగా పూర్తిచేయాలని జైకా బృందం కాంట్రాక్టర్లను ఆదేశించింది. మండలంలోని మాతుమూరు వద్ద చేపడుతున్న ఆధునీకరణ పనులను మంగళవారం పరిశీలించారు. పనులు వేగవంతానికి అవసరమైన సిబ్బందిని, యంత్రాలను వినియోగించి పనులు పూర్తి చేయాలని సూచించారు. ఆధునీకరణ పనులపై పెద్దగెడ్డ ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షించారు. ఇప్పటికే రెండు కిలోమీటర్లు కాంక్రీట్ లైనింగ్ పనులు పూర్తయ్యాయని, మరో 5కిలోమీటర్లు లైనింగ్ పనులకు సిద్ధం చేశామని డిఇ కనకారావు నివేదించారు. డిసెంబర్ 31నాటికి 18 కిలోమీటర్లు లైనింగ్ పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పరిశీలనలో జైకా బృందం అధికారులు మహమ్మద్ సబ్జన్, ఆర్.మోహన్‌రావు, ఇఇ ఆర్.అప్పలనాయుడు, క్వాలిటీ కంట్రోల్ డిఇ పి.లక్ష్మి పాల్గొన్నారు

పాఠశాలల పరిశీలన

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

మండలంలోని ఎల్ఎన్‌పురం, కృష్ణపల్లి, పెదమరికి ప్రాథమిక పాఠశాలలను మంగళవారం డిఇఒ ఎస్‌డివి రమణ ఆకస్మికంగా పరిశీలించారు. ఆయా పాఠశాలల్లో మౌలిక వసతులను పరిశీలించడంతో పాటు, మధ్యాహ్న భోజనంతో పాటు అందిస్తున్న రాగిజావ పంపిణీని పరిశీలించారు. విద్యార్థులతోనూ, మధ్యాహ్నభోజన నిర్వాహకులతోనూ మాట్లాడారు. పాఠశాలలకు చెందిన దస్త్రాల నిర్వహణను పరిశీలించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు భోగిరవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పంట నష్టాన్ని గుర్తించాలి : కలెక్టర్

ప్రజాశక్తి - కలెక్టరేట్

జిల్లాలో పంట నష్టాన్ని గుర్తించాలని కలెక్టర్ నిశాంత్ కుమార్ అన్నారు. శతశాతం ఇ-క్రాప్, ఇ-కెవైసి, పిఎం కిసాన్, వైఎస్ఆర్ యాప్ పనితీరు నమోదు చేయించాలని తెలిపారు. వ్యవసాయం, వ్యవసాయ అనుబంధ శాఖల మండల స్థాయి అధికారులతో మంగళవారం కలెక్టరు కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వ్యవసాయ, అనుబంధ శాఖలైన ఉద్యాన వన, పశు సంవత్సర్ధక, మత్స్య, మైక్రో ఇరిగేషన్ శాఖల్లో అమలవుతున్న పథకాల పురోగతిపై కలెక్టరు సమీక్షించారు. అనంతరం కలెక్టరు మాట్లాడుతూ ఇకెవైసి పూర్తి కాని ప్రాంతాలపై దృష్టి సారించి ఇకెవైసి పూర్తిచేయాలన్నారు. మండల వ్యవసాయ అధికారులు ప్రతి రైతు భరోసా కేంద్రాన్ని సందర్శించి, లక్ష్యాలు సమీక్షించాలని తెలిపారు. శతశాతం ఇ-క్రాప్, ఇ- కెవైసి నమోదు చేయించాలని, లేనిచో సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని అన్నారు. ఇటీవల కాలంలో వర్షాలు తరుచుగా పడడం వల్ల పంట నష్టం జరిగిన ప్రాంతాలకు సంబంధిత అధికారులు వెళ్లి నష్టాన్ని గుర్తించాలన్నారు. తరుచూ పడుతున్న వర్షాలకు సంబంధిత అధికారులు, సిబ్బంది సెలవులు పెట్టరాదని ఆదేశించారు. పంట నష్టంపై ప్రభుత్వం అందిస్తున్న పరిహారంపై రైతులకు అవగాహన కల్పించి, లాభం పొందేలా చూడాలన్నారు. జిల్లాలో రైతుభరోసా కేంద్రాల్లో ఏర్పాటు చేస్తున్న కస్టమర్ హైరింగ్ సెంటర్లకు (సిహెచ్‌సి) అవసరమగు పరికరాలు అందించాలన్నారు. పశుసంవర్ధక శాఖకు సంబంధించి జిల్లాలో పాల ఉత్పత్తులు పెరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఉద్యానశాఖకు సంబంధించి జిల్లాలో ఆయిల్ ఫామ్స్, అరటి నష్టం, తదితర అంశాలపై సమీక్షించారు. జిల్లాలో చేపల పెంపకం, ఫిష్ దుకాణాలు ఏర్పాట్లపై దృష్టి సారించాలని మత్స్యశాఖ అధికారులను ఆదేశించారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి కె.రాబర్ట్ పాల్, జిల్లా మత్స్య అధికారి వి.తిరుపతయ్య, జిల్లా మైక్రో ఇరిగేషన్ శాఖ అధికారి ఎల్. శ్రీనివాసరావు, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ ఎ.ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్



సీతానగరంలో నేలకొరిగిన జొన్నపంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

పంట నష్టం పరిశీలించిన వ్యవసాయ అధికారులు

సాలూరురూరల్ : మండలం లోని శివరాంపురంలో ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న మొక్కజొన్న పంట నష్టాన్ని మంగళవారం వ్యవసాయ శాఖ ఎడి మధుసూదనరావు, ఎఒ అనురాధ పండా పరిశీలించారు. కొద్దిరోజుల క్రితం కురిసిన భారీ వర్షాలకు గ్రామంలో మొక్కజొన్న కోత దశలో నేలకు ఒరిగిపోయింది. దీంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. గ్రామ వ్యవసాయ సహాయకుల ద్వారా పంట నష్టం అంచనా వేస్తున్నామని ఎఒ అనురాధ పండా చెప్పారు. సుమారు 15ఎకరాల వరకు నష్టం ఉండొచ్చునని చెప్పారు. ఈ సందర్భంగా ఎడి మధుసూదనరావు మాట్లాడుతూ పంటకోత దశలో ఉన్న రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నూర్పు చేసిన రైతులు జొన్నలను టార్పాలిన్‌తో కప్పి వుంచాలని సూచించారు.

సీతానగరం : మండలంలోని గత రెండురోజులుగా కురిసిన ఆకాల వర్షాలకు లక్ష్మీపురంలో నెలకొరిగిన మొక్క జొన్న పంటను మంగళవారం మండల వ్యవసాయాధికారి సవరపు అవినాష్ పరిశీలించారు. 33శాతం పంట నష్టం వాటిల్లితే అటువంటి వాటిని నమోదుచేసి జిల్లా అధికారులకు నివేదిక పంపిస్తామని తెలిపారు. ఇప్పటివరకు లక్ష్మీపురంలో 10మంది రైతులకు చెందిన 10ఎకరాలు మొక్కజొన్న పంట నష్టం వచ్చిందని, ప్రాథమిక అంచనాగా గుర్తించామని చెప్పారు. పూర్తినష్టం బుధవారం నుంచి నమోదు చేసి ఉన్నతాధికారులకు తెలియజేస్తామన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు సిహెచ్.వినయ్, రైతులు పాల్గొన్నారు.



ఎస్ఐకు వినతిని అందజేస్తున్న ప్రజాసంఘాల సభ్యులు

మృతుల కుటుంబాలకు పరిహారమివ్వాలి

క్వారీ కార్మికుల బంధువులతో సిఐటియు నిరసన

ప్రజాశక్తి - సాలూరు

మండలం లోని కొత్తవలస క్వారీలో మృతి చెందిన ఒడిశా మల్కన్ గిరి ప్రాంతానికి చెందిన కార్మికుల కుటుంబాలకు రూ.20లక్షల నష్టపరిహారం చెల్లించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్వైనాయుడు, మండల నాయకులు ఎం.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. మంగళవారం వారు మృతులు సుజిత్, సోమా కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం వారితో కలిసి నిరసన తెలిపారు. క్వారీలో యాజమాన్యం సరైన భద్రతా ప్రమాణాలు పాటించని కారణంగానే ప్రమాదాలు జరుగుతున్నాయని చెప్పారు. మృతుల కుటుంబాలకు ఆదుకోవాలని డిమాండ్ చేశారు. భద్రతా ప్రమాణాలు పాటించేలా చూడాలని కోరుతూ జిల్లా ఎస్పీ, కలెక్టర్‌లకు వినతులు పంపిస్తామని చెప్పారు. అనంతరం రూరల్ ఎస్ఐ ప్రయోగమూర్తికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు సురేష్, గెమ్మెల ఏసుబాబు తదితరులు ఉన్నారు.

ప్లాస్టిక్ అమ్మకాలపై దాడులు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పట్టణంలోని పలు వాణిజ్యసముదాయాల్లో ప్లాస్టిక్ అమ్మకాలు జరుపుతున్నట్లు సమాచారం రావడంతో మంగళవారం మున్సిపల్ కమిషనర్ జె. రామఅప్పలనాయుడు ఆదేశాల మేరకు మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ సిహెచ్.మురళి ప్రజారోగ్య సిబ్బందితో కలిసి ప్లాస్టిక్ అమ్మకాలు సాగిస్తున్న వ్యాపార, వాణిజ్య సముదాయాల్లో సోదాలు నిర్వహించారు. ఈ సోదాల్లో వాటిని నిల్వ ఉంచి అమ్మకాలు చేసున్న వారి నుండి అపరాధ రుసుం వసూళ్లు చేసి, ప్లాస్టిక్ గ్లాసులను, కవర్లను, స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ప్రజారోగ్య అధికారి మాట్లాడుతూ పట్టణ పరిధిలో ప్లాస్టిక్ పై నిషేధించినప్పటికీ, నిషేధానికి తూట్లు పొడుస్తున్నారని, ఇదే పరిస్థితి పునరావృతమైతే ట్రేడ్ లైసెన్స్‌లు రద్దు చేస్తామని హెచ్చరించారు.


మహిళా సాధికారతే లక్ష్యం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - జియమ్మవలస

మహిళా సాధికారతే ప్రభుత్వ ముఖ్యోద్దేశమని కురుపాం ఎమ్మెల్యే పి.పుష్ప శ్రీవాణి అన్నారు. మంగళవారం మూడో విడత ఆసరా సమావేశం మండలంలోని పెద్దమేరంగి జంక్షన్లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాదయాత్రలో ఇచ్చిన హామీల మేరకు ముఖ్యమంత్రి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. అందులో భాగంగా మండలంలోని 1079 మహిళా సంఘాల్లోని 12వేల మంది మహిళలకు రూ.5.72 కోట్లు ఆసరా పేరుతో రుణమాఫీని మహిళలకు అందజేస్తున్నామని తెలిపారు. మహిళలు అభివృద్ధి చెందితేనే కుటుంబాలు అభివృద్ధి చెందుతాయన్నారు. అనంతరం సిఎం జగన్మోహన్‌రెడ్డి చిత్రపటానికి ఎమ్మెల్యే, మహిళలు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు ఎం.శశికళ, ఎంఎస్ఎంఇ డైరెక్టర్ ఎం.గౌరీశంకరరావు, డిసిసిబి డైరెక్టర్ లోలుగు నారాయణరావు, వైస్ ఎంపిపి గుడివాడ సంపత్ కుమార్, ఎంపిడిఒ ఎస్.రమేష్, ఎపిఎం బి.వెంకట్, మండల మహిళా సమాఖ్య అధ్యక్షులు అల్లు ఉషారాణి, పలువురు ఎంపిటిసి సభ్యులు, సర్పంచులు, సిసి, సిబ్బంది పాల్గొన్నారు.



మహిళలకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి



మహిళలకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురంరూరల్ : మహిళా సాధికారతకు నవరత్నాలులో భాగంగా ప్రభుత్వం ఆసరా ద్వారా అందిస్తున్న సహాయం ఎంతగానో తోడ్పడుతుందని స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. మండలంలోని వెంకంపేట వైకూడలిలో జరిగిన కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకురాలు శోభా హైమావతితో మూడు విడత ఆసరా చెక్కులను మండలంలోని 1150 సంఘాలకు చెందిన 13,072 మంది స్వయంసహాయక సభ్యులకు రూ.6.07కోట్లు అందజేశారు. కార్యక్రమంలో ఎంపిడివో అకిబ్‌జావేద్, వెలుగు ఎపివో పిసురేష్, ఎంపిపి మజ్జిశోభారాణి, జెడ్‌పిటిసి బలగ రేవతమ్మ, ఎఎంసి చైర్మన్ భాగ్యలక్ష్మి, మండల సమాఖ్య నాయకులు, వైసిపి నాయకులు బొమ్మి రమేష్, బలగ నాగేశ్వరరావు, చంద్రశేఖర్, భీమవరపు కృష్ణమూర్తి, తీళ్ల కృష్ణారావు, మాధవరావు, గండి శంకరావు, బంకురు రవికుమార్‌తో పాటు సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, కార్యకర్తలు, మహిళా సంఘాల సభ్యులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.



చండీయాగం చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

ఘనంగా పోలమాంబ జాతర ముగింపు ఉత్సవం

ప్రజాశక్తి - మక్కువ

ఉత్తరాంధ్ర ఆరాధ్య దేవత శంబర పోలమాంబ అమ్మవారి ముగింపు జాతర ఘనంగా జరిగింది. జనవరి 23 నుంచి ప్రారంభమైన జాతర 10 వారాల పాటు కొనసాగింది. మంగళవారం చివరి జాతర కావడంతో దేవాదాయశాఖ వనం గుడి వద్ద మహాచండి యాగం అన్నదానాన్ని ఏర్పాటు చేసింది. పట్టణానికి చెందిన వేమకోటి మల్లికార్జున శర్మ ఆధ్వర్యంలో వేద పండితులతో యాగాన్ని జరిపించారు. దేవాదాయ శాఖ ఇఒ రాధాకృష్ణ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ దాలినాయుడు దగ్గరుండి కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. జాతర సందర్భంగా మక్కువ ఇన్‌ఛార్జ్ ఎస్ఐ ఎం.వెంకటరమణ పర్యవేక్షణలో 30మంది పోలీసులు, సిఆర్‌పిఎఫ్ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యులు, స్థానిక ఉప సర్పంచ్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

భద్రాచలంకు ప్రత్యేక బస్సులు

ప్రజాశక్తి- విజయనగరం కోట

శ్రీరామనవమి సందర్భంగా భద్రాచలంలో సీతారాముల కల్యాణ 'మహోత్సవానికి హాజరయ్యే భక్తుల కోసం విజయనగరం నుండి భద్రాచలంకు ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు డిపో మేనేజర్ జె.శ్రీనివాసరావు తెలిపారు. ఈనెల 29న సాయంత్రం 5గంటలకు విజయనగరం ఆర్‌టిసి కాంప్లెక్సు నుంచి బస్సులు బయలుదేరి గురువారం ఉదయం 5గంటలకు భద్రాచలం చేరుతుందని తెలిపారు. అదేరోజు(30న) సాయంత్రం 6గంటలకు భద్రాచలం వద్ద బయలుదేరి శుక్రవారం ఉదయం 5.30గంటలకు విజయనగరం చేరుతుందని తెలిపారు. ఒక వైపు టిక్కెట్ పెద్దలకు రూ.840, పిల్లలకు రు. 455గా నిర్ణయించినట్లు తెలిపారు. టిక్కెట్లు కావలసినవారు ఆర్టీసీ కాంప్లెక్స్ రిజర్వేషన్ కౌంటర్లో గాని ఆన్‌లైన్‌లో గాని రిజర్వేషన్ చేసుకోవచ్చునని తెలిపారు. వివరాలకు 7382920648, 7382924083 నంబర్లను సంప్రదించాలన్నారు. సమావేశంలో అసిస్టెంట్ మేనేజర్ బి.ఆదినారాయణ పాల్గొన్నారు.


కమిషనర్‌కు వినతిని అందజేస్తున్న మున్సిపల్ కార్మికులు

పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

పార్వతీపురంటౌన్ : మున్సిపల్ పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని మంగళవారం పట్టణంలో మున్సిపల్ ప్రజారోగ్య విభాగంలో పారిశుధ్య విధులు నిర్వహిస్తున్న పారిశుధ్య కార్మికులతో కలిసి మున్సిపల్ కమిషనర్ జె.రామప్పలనాయుడుకు సిఐటియు జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ ఆధ్వర్యంలో వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ కాంట్రాక్ట్ పారిశుధ్య కార్మికులకు 2022 సంవత్సరం హెల్త్‌అలవెన్స్ ఇవ్వాలని, సబ్బులు, నూనెలు, దుస్తులు, చెప్పులు ఇవ్వాలని, పిఎఫ్, ఇఎస్ఐ అమలు చేసి కార్డులివ్వాలని, పర్మినెంట్ వర్కర్లకు ఐదు డిఎలు, రెండు సరెండర్ లీవ్‌లు, పిఆర్‌సి, జిపిఎఫ్ అకౌంట్స్, హెల్త్ కార్డులు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో బీఫ్రుపల్లి సింహాచలం, నాగవంశం శంకరరావు, మామిడి శివ, నాగవంశం మాధవరావు, బి రాజేష్, ఎం.శ్రీను, తదితర కార్మికులు పాల్గొన్నారు.

గుజ్జువాయిలో 60మందికి వైద్యసేవలు

కురుపాం : మండలంలోని గుజ్జువాయిలో 104 ఆధ్వర్యంలో మంగళవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మొండెంఖల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి బి.ప్రజ్ఞ 60 మందికి వైద్య సేవలందించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. అనంతరం బాలింతలకు, వృద్ధులతో ఉన్నవారి ఇళ్లకు వెళ్లి వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో హెల్త్ విజిటర్ కె.పెంటమ్మ, ఎంఎల్‌హెచ్ పి.మహేశ్వరి, ఎఎన్ఎం సుభవాసి, హెల్త్ అసిస్టెంట్ రామారావు, 104 సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పోస్ట్ మెట్రిక్ హాస్టల్ సందర్శన

సీతంపేట : స్థానిక బాలికల పోస్ట్ మెట్రిక్ వసతి గృహాన్ని డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ జీవనజ్యోతి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులు ఏ విధంగా చదువుతున్నారని పరిశీలించారు. పరీక్షలు దగ్గర పడుతున్నాయని, బాగా చదువుకోవాలని కోరారు, వేళకు భోజనం చేసి, ప్రణాళిక ప్రకారం చదువుకోవాలని సూచించారు.

సర్వే పూర్తయిన గ్రామాల్లో కొలత రాళ్లు

భామిని : మండలంలో జగనన్న సమగ్ర భూ రీసర్వేలో భాగంగా సర్వే పూర్తయిన గ్రామాలకు వైఎస్ఆర్ జగనన్న సమగ్ర భూరక్ష 2020 పేరు గల గ్రానైట్ కొలత రాళ్లు మండలానికి చేరాయి. ప్రస్తుతం ఈ కొలత రాళ్లు పూర్తి స్థాయిలో సర్వే నిర్వహించిన, గ్రామ సభలో ఎటువంటి అభ్యంతరాలు లేని దిమ్మిలి గ్రామాల్లో ఏర్పాటు చేస్తామని తహశీల్దార్ ఎస్.అప్పారావు తెలిపారు.

వరి పైరు పరిశీలన

భామిని : మండలంలోని గురండి సమీపంలో రబీ వరి పైరును మంగళవారం సీతంపేట వ్యవసాయ పరిశోధన సంస్థ ప్రధాన శాస్త్రవేత్త సీతారాం, శాస్త్రవేత్తలు లక్ష్మీనారాయణ, సౌజన్య, పాలకొండ ఎడి ఎ.రత్నకుమారి పరిశీలించారు. పెరిగిన వరి పైరులో పాడ ఈగను గుర్తించి, దానికి గానూ క్లోర్ పైరిఫ్ మందును లీటర్ నీటికి 2.5 ఎం ఎల్ కలిపి పిచికారీ చేయాలని సూచించారు. ఈ పరిశీలనలో మండల వ్యవసాయాధికారి కె.సింహాచలం, నేరడి వ్యవసాయ సహాయకులు ఈశ్వరరావు ఉన్నారు.

బందలుప్పిలోని ఫ్యామిలీ డాక్టర్

పార్వతీపురంరూరల్ : మండలంలోని జమ్మిడివలసలో మంగళవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని బందలుప్పి పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ పి.శ్రీకాంత్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ శిబిరానికి వయోవృద్ధులు, గర్భిణులు, షుగర్, బిపి, ఆస్తమా పిట్స్ మొదలగు వ్యాధులతో బాధపడుతున్న అందరూ వచ్చారు. వీరికి వైద్య పరీక్షలు నిర్వహించి వారికి కావాల్సిన మందులు ఇస్తూ తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అలాగే ఆసుపత్రిలో ప్రసవాలు జరిగేలా గర్భిణీలను ప్రోత్సహించాలని వైద్య సిబ్బందికి సూచించారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు, మంచానికే పరిమితమైన వారి ఇంటికే వెళ్లి వైద్య సేవలందించారు. ప్రజలు ఈ వైద్య సేవలు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ రాజేంద్రప్రసాద్, 104 సిబ్బంది ఆనందరావు, సంతోష్, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు

బలిజిపేట : విద్యార్థులకు విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని, కావున ఉపాధ్యాయులు సహకారంతో అభివృద్ధి కావాలని మండలంలోని పెదపెంకి జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామారావు విద్యార్థులకు సూచించారు. పాఠశాలలో టెన్త్ విద్యార్థుల వీడ్కోలు సభ మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్య విలువలు గొప్పవని, వాటిని అవలంభించుకునే విధానంలో విద్యార్థులు ఎప్పుడు నిత్య విద్యార్థిగా ఉండాలని అన్నారు. విద్యను నేర్చుకోవడంలో ఆసక్తి కనబరచడంలో ప్రాథమికంగా ముందుకు సాగాలని, ఇలా సాగిన ప్రతి విద్యార్థి జీవితంలో అద్భుతమైన విజయాలు చవిచూస్తాడని అన్నారు. అనంతరం విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, నేతాజీ గ్రంథాలయ వ్యవస్థాపకులు ఈర్ల సంజీవనాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్సాహంగా పెదబొండపల్లి విద్యార్థుల వీడ్కోలు సభ

పార్వతీపురంరూరల్: మండలంలోని పెదబొండపల్లి జెడ్పీ హైస్కూల్లో మంగళవారం జరిగిన వార్షికోత్సవంతో పాటు టెన్త్ విద్యార్థుల వీడ్కోలు సమావేశం విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనల మధ్య ఉల్లాసంగా... ఉత్సాహంగా సాగింది. ప్రధానోపాధ్యాయులు గౌరి అధ్యక్షతన జరిగిన సభలో ఆమె మాట్లాడుతూ ఉపాధ్యాయులు నేర్పిన విషయాలను, బోధించిన పాఠాలను శ్రద్ధతో మననం చేసుకుని సన్నద్ధులై ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా పరీక్షలు రాసి ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలతో సమావేశం అద్యంతం ఆకట్టుకుంది. ఈ సందర్భంగా పార్వతీపురం పట్టణానికి చెందిన పెంట పాటి కిరణ్ విద్యార్థులు పరీక్షలు రాసుకునేందుకు పాడ్‌లు(అట్టలు) పంపిణీ చేయగా, ఉపాధ్యాయులు లక్ష్మి పెన్నులు,పెన్సిల్, తదితర పరికరాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిఆర్‌పి దీప్తి, తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే లక్ష్యంగా పాలన

పార్వతీపురంరూరల్ : పేదల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పరిపాలన సాగిస్తుందని స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. మంగళవారం మండలంలోని జమదాలలో గడపగడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గడపగడపకు వెళ్లి ప్రజలను కలుసుకొని ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను వివరించారు. అనంతరం లబ్ధిదారులకు అందిన సంక్షేమ పథకాల వివరాలు తెలియజేసే కరపత్రాలను అందించారు. కార్యక్రమంలో ఎంపిపి మజ్జి శోభారాణి, జెడ్పిటిసి సభ్యులు బలగ రేవతమ్మ, ఎఎంసి చైర్మన్ ఎం భాగ్యశ్రీ, మండల వైసిపి అధ్యక్షుడు బొమ్మి రమేష్, ఆత్మ చైర్మన్ పై తిరుపతిరావు, మండల వైసిపి సీనియర్ నాయకులు భీమవరం కృష్ణమూర్తి, బంకపల్లి రామకృష్ణ, సర్పంచులు పి సూరిబాబు, జి రాజు, పలువురు నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రాలను సందర్శించిన ఎంపిడిఒ

కురుపాం: మండలంలోని మొండెంఖల్, గుమ్మ అంగన్వాడీ కేంద్రాలను ఎంపిడిఒ పి.నాగేశ్వరరావు మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా కేంద్రాల్లో రికార్డులను పరిశీలించి స్టాక్ నిల్వ ప్రకారం ఉన్న రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం కేంద్ర వండిన ఆహారాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. గర్భిణీలకు, బాలింతలకు, పిల్లలకు పౌష్టికాహారం అందించడంతో పాటు వారు ఆరోగ్యంగా ఉండే దానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సూచనలు, సలహాలు ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపిడిఒ నాగేశ్వరరావు

అభివృద్ధికి చొరవ చూపాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - వీరఘట్టం

ప్రాంతాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ చొరవ చూపాలని స్థానిక ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మండల సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. అందరూ బాధ్యత తీసుకొని ప్రాంతాల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. అప్పుడే ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి ఆశయాలు నెరవేరుతాయని ఆమె స్పష్టం చేశారు. నవరత్న పథకాలు అర్హులైన వారికి అందించడం వల్ల వారి జీవితంలో వెలుగునిస్తున్నట్లు తెలిపారు. మండలంలో ఏ విధమైన సమస్యలున్నా వాటిని పరిష్కరించేందుకు మీ ముందే ఉంటామని స్పష్టం చేశారు. ఈ ప్రాంతంలో ఏనుగులు సంచరిస్తున్నాయని, వీటిని శాశ్వత ప్రాంతాలకు తరలించాలని అన్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశంలో ప్రస్తావించడంతో పాటు వినతి పత్రం కూడా అందజేశామన్నారు. ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ మాట్లాడుతూ పరిపాలన విధానం మారిందని, ఒకప్పుడు సర్పంచ్ ఇంటికి వెళ్లి ఏ పనులైనా జరిపించుకున్నామని, ఇప్పుడు ఆ పరిస్థితి లేదని గ్రామాల్లో సచివాలయాలు ఏర్పాటు చేయడంతో పాలనలో మార్పు కలగడంతో అర్హులైన వారికి సంక్షేమం పథకాలు అందజేస్తున్నట్లు స్పష్టం చేశారు. గ్రామాల్లో ఏ సమస్యలొచ్చినా వాటిపైన తక్షణం స్పందించి సమస్య పరిష్కారమయ్యేలా చూడాలని అధికారులను ఆదేశించారు. అలాగే వీరఘట్టంలోని ప్రధాన రహదారి అభివృద్ధి పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. ఎంవి పురం, తలవరం, కుమ్మరిగుంట, పనసనందివాడ, బిటివాడ గ్రామస్తులకు డ్రిప్ ఇరిగేషన్ పథకం ద్వారా నీరందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఆర్థిక శాఖ ఆమోదం తెలిపిన వెంటనే ఇక్కడ పనులు చేపట్టేందుకు చర్య చేపడుతున్నట్లు తెలిపారు. అనంతరం వ్యవసాయ శాఖకు ఎఒ ఎం.మన్మథరావు సమీక్షిస్తుండగా ఎంపిపి డి.వెంకటరమణ కలుగజేసుకొని రాయితీ ద్వారా రైతులకు పెసర, మినువులు, మోటర్ పైపులు తదితరమైన అందించేందుకు బాధ్యత తీసుకోవాలన్నారు. హౌసింగ్‌శాఖకు సంబంధించి ఎఇ వినోద్ కుమార్ సమీక్షిస్తుం డగా ఎమ్మెల్సీ విక్రాంత్ కలుగజేసుకుని గృహాల మంజూరు విషయంలో సర్పంచుల దృష్టికి తీసుకువెళ్లాలని స్పష్టం చేశారు. ఏ సర్పంచి నుంచి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలన్నారు. ఇదే విషయంపై చలివేంద్రి ఎంపిటిసి పోరెడ్డి వెంకట నాయుడు మాట్లాడుతూ గృహ నిర్మాణం చేపట్టేందుకు సిమెంటు ఇస్తున్నారని, తనకు తెలియదని, రాత్రి గ్రామంలో ఎస్సీలకు సిమెంటు ఇవ్వడం తెలిసిందని అధికారులు కనీసం తమకు ఏ విషయం చెప్పడం లేదు కదా తమ సమస్యలను కూడా పట్టించుకోవడంలేదని అన్నారు. తానవరం సర్పంచ్ సిహెచ్ మధుసూదనరావు మాట్లాడుతూ ఇప్పటివరకు ఎన్ని గృహాలు కట్టారని ప్రశ్నించారు. ఆర్‌డబ్ల్యుఎస్‌శాఖ జెఇ కె.పాపారావు సమీక్షిస్తుండగా ఎమ్మెల్యే వి.కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్ మాట్లాడుతూ మండలంలో తాగునీటి సమస్య లేకుండా చూడాలని ఆదేశించారు. అనంతరం వైద్య, విద్యం, ఉపాధి, ఐసిడిఎస్ తదితర శాఖలకు సంబంధించి సమీక్షించారు. సమావేశంలో జెడ్‌పిటిసి జంపు కన్నతల్లి ఉమామహేశ్వరరావు, మండల ఉపాధ్యక్షులు పి.విజయకుమారి, వి.భార్గవ్, ఇన్చార్జి ఎంపిడిఒ వై.వెంకటరమణ, మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ కర్రి లీలాప్రసాదరావు, కో-ఆప్షన్ వైశ్యరాజు గోవిందరాజు, తదితర శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కళావతి


వాహనచోదకులతో మాట్లాడుతున్న డిఎస్‌పి కృష్ణారావు

పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన డిఎస్‌పి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఎల్విన్‌పేట పోలీస్ స్టేషన్‌ను పాలకొండ డిఎస్‌పి జివి కృష్ణారావు మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా నాటు సారా కేసులో పట్టుబడి సీజ్ చేసిన మోటారు సైకిళ్లకు నిర్వహించిన వేలంపాటలో పాల్గొన్నారు. అనంతరం పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మొక్కలను నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో నాటు సారా వంటకాలు, అమ్మకాలపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. ఇటువంటి వారిపై క్రిమినల్ కేసు నమోదు చేస్తామన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు వాహనాలు ఇవ్వరాదని, ఎక్కడైనా మైనర్ పిల్లలు వాహనం నడిపినట్టు కనిపిస్తే తల్లిదండ్రులపై కేసు నమోదు చేస్తామన్నారు. అన్ని పత్రాలు కలిగి ఉండి వాహనాలు నడపాలని, నెంబర్ ప్లేట్లు, లైసెన్సు లేని వాహనాలు నడిపితే చట్టపరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు. పలువురు బైక్ మెకానిక్‌లు విడిభాగాలతో వాహనాలు తయారుచేసి ఇస్తున్నారని అన్నారు. ఇటువంటి వాహనాలు నాటుసారా రవాణా వినియోగానికి ఎక్కువ శాతం వినియోగిస్తున్నారన్నారు. ఇటువంటి వాహనాల కూడా ఎక్కడైనా పట్టుబడితే వాహనదారుడు, మెకానిక్‌పైన కూడా కేసు నమోదు చేస్తామన్నారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిఐ సత్యనారాయణ, ఎస్ఐ షణ్ముఖరావు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిని కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

మండలంలోని వెంకంపేటలో సోమవారం పిడుగుపాటుకు మృతి చెందిన ఇంటర్ విద్యార్థిని పత్ర మౌనిక కుటుంబాన్ని మంగళవారం స్థానిక ఎమ్మెల్యే అలజంగిజోగారావు, మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు పరామర్శించారు. ఈ సందర్భంగా వారి కుటుంబానికి అండగా నిలిచి సాయపడతామని ప్రకటించారు.


పచ్చదనంతో ఉన్న వరి పొలాలు

వేసవిలోనూ పచ్చని శోభ

ప్రజాశక్తి - భామిని

మండలంలోని గురండి నుంచి కాట్రగాడ-బి వరకు ప్రధాన రహదారికి ఇరువైపులా వేసవిలో పండిస్తున్న వరి పైరు ఏపుగా పెరిగి పచ్చని శోభను సంతరించుకొని ప్రధాన రహదారిపై వెళ్తున్న చోదకులకు చల్లటి గాలితో ఆహ్లాదాన్ని కలిగిస్తున్నాయి. ఈ ప్రాంతంలో రైతులకు వ్యవసాయ బోర్లు అందుబాటులో ఉండడంతో, ప్రతి ఏటా రెండు దఫాలుగా వరి పంటను పండిస్తారు. ఈ వేసవిలో మండలంలోని క్రాప్ బుకింగ్ అయిన, క్రాప్ బుకింగ్ చేయాల్సిన దాంతో కలిపి 813 ఎకరాల్లో వరి సాగు జరుగుతుందని వ్యవసాయధికారి కె.సింహాచలం తెలిపారు.

గ్రామాల అభివృద్ధికి చొరవ చూపాలి : డిపిఒ

ప్రజాశక్తి - వీరఘట్టం

గ్రామాల అభివృద్ధికి చొరవ చూపాలని జిల్లా పంచాయతీ అధికారి బలివాడ సత్యనారాయణ సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం స్థానిక చెత్త నుంచి సంపద తయారీ కేంద్రంలో ఏర్పాటు చేసిన శిక్షణా తరగతుల్లో ఆమె మాట్లాడారు. గ్రామాల్లో చెత్తను సేకరించి సంపద కేంద్రాలకు తరలించి, సంపద తయారు చేసి వాటి ద్వారా వచ్చే ఆదాయాన్ని పంచాయతీల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ప్రతి ఒక్కరూ ఆ దిశగా శిక్షణలో నేర్చుకున్న ప్రతి అంశాన్ని గ్రహించి పంచాయతీల్లో అమలు చేయాలని సూచించారు. వీరఘట్టంలో సంపద కేంద్రాన్ని ఆదర్శంగా తీసుకొని పంచాయతీల అభివృద్ధికి చొరవ చూపాలన్నారు. వీరఘట్టం మేజర్ పంచాయతీ ఇఒ వి.రామచంద్రరావు ఆధ్వర్యంలో జరిగిన శిక్షణా తరగతుల్లో పాలకొండ, జిఎల్ పురం, కురుపాం, సీతంపేట తదితర మండలాల నుంచి పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

వర్మీకంపోస్టు ద్వారా పంచాయతీలకు ఆదాయం

సీతానగరం : జగనన్న స్వచ్ఛ సంకల్పలో భాగంగా పంచాయతీల్లో గల ఎస్‌డబ్ల్యూపిసి షెడ్లలో ప్రతి ఇంటి నుంచి సేకరించిన తడిచెత్త, పొడి చెత్తను వేరుచేసి వర్మీకంపోస్టు తయారు చేయడం ద్వారా పంచాయతీకి ఆదాయం సమకూరడంతో పాటు గ్రామస్తులకు మంచి ఆరోగ్యాన్ని అందించగలమని పార్వతీపురం డిఎల్‌పిఒ దేవకుమార్ తెలిపారు. మండలంలోని పెదబోగిలిలో గల చెత్త నుండి సంపద తయారీ కేంద్రంలో రెండురోజుల శిక్షణా కార్యక్రమాన్ని ఆయన మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో సక్రమంగా నిర్వహించాలన్నారు. ఎంపిడిఒ కృష్ణమహేష్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన సమగ్ర అభివృద్ధి లక్ష్యాలను సాధించేందుకు సిబ్బంది పంచాయతీ సహకారంతో కృషి చేయాలన్నారు. నేటి శిక్షణ అందుకు దోహదపడేలా ఉండాలని కోరారు. ఇఒపిఆర్‌డి వర్మ మాటాడుతూ ఆరోగ్యకరమైన సమాజాన్ని సాధించేందుకు అంతా కృషి చేయాలని కోరారు. శిక్షణలో తెలుసుకున్న విషయాలను ఆచరణలో చూపాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిపి బలగ రవణమ్మ, సర్పంచ్ జొన్నాడ తేరీజమ్మ, ఎంపీటీసీలు సురగాలి గౌరి, కుసుమ శ్రీకుమారి, ఉపసర్పంచ్ కె.అరవింద్, ఇఒ వెంకటరావు, సెక్రటరీ సుధారాణి, వివిధగ్రామాల సర్పంచులు, కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న డిపిఒ సత్యనారాయణ


సైకిల్ ర్యాలీ ప్రారంభిస్తున్న సత్యనారాయణ

చలో ఢిల్లీ జయప్రదం కోరుతూ సైకిల్ ర్యాలీ

ప్రజాశక్తి - బలిజిపేట

కేంద్రంలో మోడీ ప్రభుత్వ విధానాలకు నిరసన ఏప్రిల్ 5న తలపెట్టిన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ సిఐటియు, రైతు, వ్యవసాయ కార్మిక, కౌలు రైతు సంఘాల ఆధ్వర్యంలో మండలంలోని బలిజిపేట, పలగర, వెంగాపురం, తుమరాడ గ్రామాల్లో సైకిల్ ర్యాలీ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం కార్మికులు, రైతులు, ప్రజలపై పెద్దఎత్తున భారాలు మోపుతూ, కార్పొరేటర్ల రాయితీలు ఇస్తూ దగా చేస్తుందన్నారు. ఉపాధిహామీ చట్టానికి బడ్జెట్‌లో నిధులు తగ్గింపు, కార్మిక చట్టాలను రద్దు చేయడం, నిత్యవస వస్తువుల పెంచడం వంటి ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతుందని విమర్శించారు. ఈ విధానాలకు నిరసనగా తలపెట్టిన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.మన్మథరావు, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గేదెల సత్యనారాయణ, బలగ సత్యనారాయణ, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు వంజరాపు సత్యంనాయుడు, నల్ల ఈశ్వరరావు, కౌలు రైతు సంఘం నాయకులు భానుమూర్తి, రైస్ మిల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు పాలీలు అప్పారావు, సింహాచలం, శంకర్రావు, సత్యం, వెంకటనాయుడు, భాస్కరరావు తదితరుల పాల్గొన్నారు.

దళితులపై ప్రభుత్వానికి ఎందుకంత వివక్ష ?

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

రాష్ట్రంలో వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ముఖ్యంగా దళితులు పూర్తిగా వివక్షతను ఎదుర్కొంటున్నారని మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు విమర్శించారు. మంగళవారం కృష్ణపల్లిలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో దళితులపై జరుగుతున్న వరుస దాడుల్లో నిందితులు ఎక్కువగా అధికార పార్టీకి చెందిన వారే కావడం చూస్తుంటే దళితులపై ఆపార్టీకి ఉన్న చిన్నచూపు అర్థమవుతుందన్నారు. సిఎం సొంత జిల్లా కడపలో కొద్దిరోజుల క్రితం పశువైద్యుడు, ఆశాఖకు చెంది డిప్యూటి డైరక్టర్ స్థాయి అధికారిని కిడ్నాప్ చేసి చంపేయడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. దళిత అధికారి అన్నెన్న కనిపించ లేదంటూ అతని కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోకపోవడం రాష్ట్ర పాలనకు అద్దం పడుతుందని అన్నారు. దళితులపై దాడులు చేయడమే కాకుండా మహిళా ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవిని అసభ్య పదజాలంతో వైసిపి సోషల్ మీడియా దూషిస్తుందని వీటిని ఆపకపోతే అణగారిన వర్గాలన్నీ ఏకమై త్వరలోనే తగిన గుణపాఠం చెబుతారని అన్నారు.


స్టాక్‌ను పరిశీలిస్తున్న తహశీల్దార్ రమేష్‌కుమార్

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోండి

ప్రజాశక్తి - కురుపాం

పాఠ శాలలు, అంగన్వాడీ కేంద్రాల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత సిబ్బందేనని తహశీల్దార్ ఆర్.రమేష్‌కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని పూతిక వలసలో గల పాఠశాల, అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. పరిసరాలు అపరిశుభ్రంగా ఉండడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం అంగన్వాడీ కేంద్రంలో రికార్డులను పరిశీలించి గుడ్లు, పాలు రికార్డులు ప్రకారంగా నిల్వ ఉన్నాయో లేదో చూస్తే స్టాక్ రిజిస్టర్‌కు, నిల్వకు తేడా ఉన్నట్లు తెలిపారు. మండల పరిషత్ పాఠశాలను సందర్శించి విద్యార్థులకు హాజరు, వారి విద్యా సామర్థ్యాన్ని పరిశీలించి అనంతరం సిబ్బందితో మాట్లాడుతూ పౌష్టికాహారం అందించడమే కాకుండా పరిసరాలు కూడా పరిశుభ్రంగా ఉంటేనే పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. కావున పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్ఐ పిఎల్‌వి ప్రసాద్, విఆర్ఒ జె.మెరకయ్య పాల్గొన్నారు.



సీతంపేట పురవీధుల్లో ర్యాలీ చేస్తున్న ఐసిడిఎస్ సిబ్బంది

సీతంపేటలో పోషన్ పక్వాడ్

సీతంపేట : మండలంలోని సామాజిక భవన్‌లో మంగళవారం పోషన్ పక్వాడ్ పౌష్టికాహార వక్షోత్సవాం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిరుధాన్యాలతో పిండి వంటలు తయారు చేసి ప్రదర్శించారు. కూరగాయలతో పోషకాలు గురించి వివరించారు. ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఒ పి.రంగలక్ష్మి అంగన్వాడీ కేంద్రాల్లో పౌష్టికాహార వక్షోత్సవాలు జరపాలన్నారు. వీటి ప్రాముఖ్యత ప్రేమతో గురించి తల్లులకు, గర్భిణీలకు తెలియజేయాలన్నారు. కూరగాయల పండించిన పంటను పౌష్టికాహారం పోషకాలు విలువలపై అవగాహన కల్పించారు. పిల్లలకు, తల్లులకు పౌష్టికాహారం అందించనున్నారు. కార్యక్రమంలో సూపర్వైజర్లు ఎసిడిపి ఒ.శాంతి, భవాని, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు


చికిత్స పొందుతున్న కనకమహాలక్ష్మి

వేధింపులు తాళలేక భార్య ఆత్మహత్యాయత్నం

పార్వతీపురం రూరల్ : మక్కువకు చెందిన శ్రీకాకుళం కనకమహాలక్ష్మి గత కొన్నేళ్లుగా భర్త కట్నం తేలేదని వేధింపులకు గురిచేయడమే కాకుండా మానసికంగా క్షోభకు గురైంది. దీంతో గత కొద్ది రోజులుగా వేధింపులు, మరీ ఎక్కువ కావడంతో మనస్తాపం చెంది మంగళవారం ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించింది. స్పందించిన స్థానికులు, భర్త కలిసి స్థానిక పిహెచ్‌సికి తరలించగా మెరుగైన వైద్యం కోసం జిల్లా ఆసుపత్రికి 108 వాహనంలో తరలించారు. వైద్యులు చికిత్స అందిస్తున్నారు. అవుట్ పోస్ట్ పోలీసులు వివరాలు నమోదు చేశారు.

మనస్థాపంతో యువకుడు..

మండలంలోని ఎమ్మార్ నగరం నెయ్యల వీధికి చెందిన బెహరా విశ్వనాథం అనే యువకుడు మనస్థాపానికి గురై ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. గత కొద్ది నెలలుగా విశ్వనాథం భార్య పుట్టింటికి వెళ్లిపోవడమే కాకుండా, పోలీసు కేసు పెట్టడంతో మనస్థాపానికి గురై మంగళవారం తన ఇంట్లో ఉన్న ఎలుకల మందును తాగి అపస్మారక స్థితికి వెళ్లిపోయాడు. స్పందించిన స్థానికులు జిల్లా ఆసుపత్రికి తరలించగా వైద్యులు చికిత్స అందిస్తున్నారు. అవుట్ పోస్ట్ పోలీసులు వివరాలు నమోదు చేశారు.

మొక్కజొన్న సాగు పట్ల అప్రమత్తం

ప్రజాశక్తి - పాచిపెంట

రాబోయే మూడు రోజుల్లో అడపాదడపా వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున రైతులు ప్రస్తుతం ఉన్న మొక్కజొన్న పంటపై జాగ్రత్తలు తీసుకోవాలని మంల వ్యవసాయాధికారి కె.తిరుపతిరావు సూచించారు. మండలంలోని కర్రివలసలో రైతు కుమార్ పొలంలో చల్లుతున్న నవధాన్యాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మొక్కజొన్న పంటలో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని, పంట నష్టం వాటిల్లితే వెంటనే సంబంధిత గ్రామ వ్యవసాయ సహాయకునికి తెలియజేయాలని కోరారు. ఆరుబయట ఆరబెడుతున్న మొక్కజొన్న గింజలను జాగ్రత్తలతో కప్పి ఉంచాలని, ఒకవేళ తడిచినట్లైతే ఐదు శాతం ఉప్పు ద్రావణం పిచికారీ చేయాలని సూచించారు. మొలక రాకుండా, నాణ్యత దెబ్బతినకుండా వారం రోజుల కాపాడుకోవచ్చని తెలిపారు. ప్రస్తుతం వర్షాలను సరియైన పద్ధతుల్లో వినియోగించుకుంటే ఉపయోగమని, వేసవి దుక్కులు దున్నుకుంటే భూమిలో నీరు నిల్వ ఉంటుందని, అలాగే మట్టి ద్వారా వ్యాపించే చీడపీడలను కూడా నివారించుకోవచ్చని తెలిపారు. మే నెలాఖరుకు వేసే మొక్కజొన్న, పత్తి పంటలకు ముందుగా ప్రస్తుత వర్షాలకు నవధాన్యాలను చల్లుకుని విత్తనం వేసే ముందుగా కలియ దున్నుకుంటే భూసారం పెరిగి మంచి దిగుబడి వస్తుందని అన్నారు. అంతేకాక రసాయన ఎరువులపై ఖర్చులు పూర్తిగా తగ్గించుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఎపిసిఎంఎఫ్ ప్రతినిధులు యశోదమ్మ, సురేష్, విజయ్ పాల్గొన్నారు.


జొన్న సంరక్షణపై సూచనలు ఇస్తున్న విఎఎ